రాణించిన ప్రతిభ

కెప్టెన్ షేక్ మౌలాలీ



చిన్ననాటి నుండి చదువులో నాకు బాగా మార్కులొస్తుండేవి. సహజంగ నాదే ఫస్టు మార్కుగా ఉండేది. ఉన్న కొద్దిపాటి పొలం ఆధారంగ చేసుకొని నన్ను చదివించాడు నాన్న.

డిగ్రీ అనంతరం ఎమ్.ఎస్సీ. ఫిజిక్సులో చేరాను. రెండేళ్ళు హాస్టలు జీవితంలో రక రకాల విద్యార్థులు వారి మనస్తత్వాలు గమనించడం జరిగింది. కొందరు పుస్తకాల పురుగులయిపోతే, పుస్తకాలంటేనే మరికొందరికి ఎలర్జీ. కొంత మందిని చూస్తే "వీరు విద్యార్థులేనా!" అనిపించేది. కాని పరీక్షలు వచ్చే సరికి అందరికి మార్కులు బాగానే వచ్చేవి. ప్రొఫెసర్లని బెదిరించి మార్కులు వేయించు కుంటారని కొంత మందిని గూర్చి హాస్టలులో అనుకునేవారు. అలాంటి వారిలో ప్రకాశం ఒకడు.

శేషాద్రి బ్లాకులో నాది ఇరవయిమూడో నంబరు గది. ప్రకాశం యిరవయి అయిదులో ఉండేవాడు. మొత్తానికి ఏదో ఆర్ట్సు సబ్జెక్టు. ఏనాడూ క్లాసుకు వెళ్ళేవాడు కాదు. వెళ్ళినా అటెండెన్సు యిచ్చి వచ్చేవాడు. చదువు అనేది అతని డైరీలో లేదు. యూనివర్శిటీ రాజకీయాలన్నీ అతని గదిలోనే ఉండేవి. ప్రక్క హాస్టలు విద్యార్థులు, వెటర్నరీ, మెడికల్, ఇంజినీరింగ్....ఎవరెవరో వస్తుండేవారు. ఎక్కడ ఏ గొడవ జరిగినా, జరగాలన్నా అతని ప్రమేయం తప్పక ఉండేది. బాగా చిల్లరగా తిరుగుతుండేవాడు.

ఆ గదిలో ఎప్పుడూ ఏదో ఒక చర్చ జరుగుతుండేది. కనుక అతని రూం మేటు నా గదికి వచ్చి చదువుకునేవాడు. ఒక్కోసారి మెస్‌కు వెళ్ళేసమయంలో వాళ్ళ గదిలో జరిగే విషయాలు, గొడవలను గూర్చి నాతో చెప్పేవాడు. ప్రకాశం ప్రస్తుతం బీదవాడని, యీ చిల్లర రాజకీయాల వలన అతనికి కొంత ముడుతుందని, ఒకసారి ప్రొఫెసరు మందలిస్తే ఆయన కొడుకుని రౌడీల చేత తన్నించాడని....ఏ వేవో చెప్తుండేవాడు.

పరీక్షలయ్యాయి. నాకు క్లాసు ఫస్టు ర్యాంకు వచ్చింది. ప్రకాశంకు కూడా ఫస్టు క్లాసు వచ్చిందని అంతా చెప్పుకున్నారు.

ప్రొఫెసర్ల ప్రోద్బలంతో యు.జి.సి. స్కాలర్ షిప్ మీద రిసర్చ్‌లో చేరాను. మూడేళ్ళలో డాక్టరేట్ వచ్చింది.

ఈ మధ్య కాలంలో మా యింటి వాతావరణంలో చాలా మార్పులొచ్చాయి. వరుసగా మూడు సంవత్సరాలు పంటలు సరిగా పండక పోవడం మూలాన నాన్న కొన్ని అప్పులు చేయాల్సి వచ్చింది. అప్పు తీర్చడానికి ఏదయినా వాణిజ్య పంటవేస్తే బావుంటుందని భావించి ప్రత్తి నాటితే మొదలంట నష్టం వచ్చి వడ్డీలు పెరిగి అప్పుల వారి ఒత్తిడికి తట్టుకొనలేక ఉన్న కాస్త పొలం అమ్మ వలసి వచ్చింది. సన్నకారు రైతులందరి పరిస్థితి దాదాపు యిలాగే అయిపోయింది.

కుటుంబ పోషణ చెయ్యలేక, స్వగ్రామం లోనే మరో చిన్న పని చేయడానికి మన సొప్పక రెండు పాడిగేదెల్ని తోలుకొని గుంటూరు శివార్లలో ఒకపాకలో కాపురం పెట్టాం. తమ్ముడ్ని హైస్కూలులో చేర్చాం. అమ్మా, నాన్న గేదెల పని చేసుకుంటూ ప్రక్కనే గల ప్రత్తి మిల్లులో ముఠా పనికి పోసాగారు. నేను పాలు తీసుకొని కొన్ని యిళ్ళు ఖాతాలుగా పోస్తూ, ప్రతిరోజు లైబ్ర

రిలోని వార్తా పత్రికలలో అడ్వర్ టైజ్ మెంట్లు చూసి ఉద్యోగాలకు అప్లయి చేయసాగాను. ఇంటర్వ్యూలకు శక్తికి మించిన చార్జీలు పెట్ట వలసి వస్తోంది. కాని ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. ప్రతి కాంపెటీటివ్ ఎగ్జామినేషన్ వ్రాస్తున్నాను. రోజులు దొర్లుతున్నాయి.

తల్లిదండ్రులు మిల్లులో కూలి చేసి సంపాయించే డబ్బు కుటుంబ ఖర్చులకు సరిపోతే, పొల మీద వచ్చే ఆదాయం నా ఉద్యోగ దరఖాస్తులకు, ఇంటర్వ్యూ ప్రయాణ ఖర్చులకు సరిపోయేది.

మూడు సంవత్సరాలు గడిచాయి. వివిధ యింటర్వ్యూలలో అధినేతల చేతుల మురికి తగిలి నా సర్టిఫికేట్లు మైలబడినాయి. కాని ఉద్యోగం ఆర్డరు ఎక్కడ నుండీ రాలేదు. క్రమంగా, ఉద్యోగం దొరుకుతుందనే ఆశ సన్నగిల్లి "ఏదయినా ట్యుటోరియల్ కాలేజీలో చేరితే కొంత ఉపయోగముంటుంద"నే ఆశ, ఆలోచన కలిగాయి.

లైబ్రరీలో న్యూస్ పేపరు తిరగేస్తుంటే వాంటెడ్ కాలంలో ఒక స్థానిక రెసిడెన్షియల్ కళాశాలలో ఫిజిక్స్ టీచరు ఉద్యోగం పడింది. జీతం రెండు వేలిస్తామని కూడా రాసి ఉంది.

మరుక్షణంలో దరఖాస్తు ఫారం పంపాను. పక్షం రోజులలో యింటర్వ్యూ కార్డు అందింది. వెళ్ళాను.

ఊరికి చివర దూరంగ అధునాతనంగా నిర్మించిన బిల్డింగుల సముదాయమది. అదొక ట్యుటోరియల్ కాలేజి అనిపించటం లేదు. ఒక ప్రొఫెషనల్ కాలేజీలాగ ఉంది. క్లాసు రూంలలో పాలిష్ చేసిన బెంచీలు, పైన ఫ్యానులు, కొన్ని గదులకు ఎయిర్ కూలర్లు, మంచినీటికి వాటర్ కూలర్లు ఉన్నాయి.

రాణించిన ప్రతిభ

ప్రక్కనే హాస్టలు వివిధ ఆధునిక వసతులతో ఉంది.

ఉద్యోగానికి పాతిక మందిదాకా అభ్యర్థులు వచ్చారు. అందరూ మంచి క్వాలిఫికేషను ఉన్నవారే! అంతా ఒక చల్లని గదిలో కూర్చున్నాం. ఒక్కొక్కరే డైరెక్టరు గదిలోకి వెళ్ళి వస్తున్నారు. నా వంతు వచ్చింది.

ఎయిర్ కండిషన్డ్ గదిలోకి అడుగు పెట్టాను. ఎదురుగా డైరెక్టరు రివాల్వింగ్ చెయిర్ లో కూర్చున్నాడు. యిరువైపుల యిద్దరు మెంబర్లు ఉన్నారు. డైరెక్టరు ముఖంలోకి చూసి స్థాణువయి పోయాను. అతనుకూడా నన్ను చూసి ఒక్క క్షణం సాలోచనగా ఉండిపోయి "మరోగంటలో యీ తతంగమంతా పూర్తవుతుంది. సాయంత్రం వరకు ఉండండి, మీతో వేరే మాట్లాడాలి!" అన్నాడు.

ప్రకాశం నన్ను గుర్తించాడనిపించింది.

మధ్యాహ్నం మూడు గంటల కంతా ఇంటర్వ్యూకి వచ్చిన అభ్యర్థులు ఎటువారలటు మెల్లమెల్లగా వెళ్ళిపోయారు. ఏ విషయం తమ చిరునామాలకు తెలియ పరుస్తామన్నారు.

సాయంత్రం అయిదు గంటలు కావచ్చింది. "డైరెక్టరుగారు రమ్మంటున్నారయ్యా!" అన్నాడు ఒకతను పరుగెత్తుకుంటూ వచ్చి. బహుశ వాచ్ మన్ అయి ఉంటాడు.

లోనకు వెళ్ళాను. మిగతా యిద్దరు మెంబర్లు కూడా వెళ్ళిపోయినట్లున్నారు. లేచి సాదరంగ కరచాలనం చేశాడు-కూర్చున్నాను.

జవాను బిస్కెట్లు, కూల్ డ్రింక్ తెచ్చాడు. వద్దనకుండ ఆరగించాను.

"బావున్నావా రామం! ఏం చేస్తున్నావు!" అన్నాడు.

నా నుండి ఏ సమాధానం రాకపోయేసరికి తానే తిరిగి చెప్పసాగాడు.

"నీ పరిస్థితి నాకర్థమయింది. కాని నేనాశ్చర్యపడడంలేదు. నా గురించి కూడా నీకు కొంత బోధపడి ఉండవచ్చు. నాకెక్కడా ఉద్యోగం దొరకదని ముందుగానే తెలుసు. ఎమ్.ఏ. కాగానే గుంటూరు చేరి ఒక అద్దె యింట్లో ట్యూషన్లు చెబుతూ, సైడ్ బిజినెస్‌గా ప్లాట్ల వ్యాపారం చేయసాగాను. రాత్రింబవళ్ళు శ్రమించి చదివించడం ద్వారా ఆ సంవత్సరం విద్యార్థులంతా పాసయ్యారు. ప్లాట్ల వ్యాపారంలో వచ్చిన లాభం రెండు లక్షలు పెట్టి కొంత స్థలం కొని సొంత పాకలలో ట్యుటోరియల్ కాలేజి పెట్టాను. మొదటి సంవత్సరం బాగా రిజల్టు వచ్చినందు వలన స్ట్రెంత్ పెరిగింది. నేను కూడా రేటు పెంచి రెసిడెన్షియల్ కాలేజి చేశాను.

వెంటనే యింజనీరింగ్, మెడికల్ ఎంట్రన్సు కోచింగ్ కూడా పెట్టాను. సంవత్సరానికి నా దగ్గర సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు కోచింగ్‌కు చేరతారు. ముప్పయి రోజులకుగాను ఒక్కొక్కరి దగ్గర ఎనిమిది వందలు ఫీజు వసూలు చేస్తాను. అంటే ఆ నెలలో నాకు ముప్పయి లక్షలపై చిలుకు వసూలవుతుందన్నమాట! సుమారు పది లక్షలు కోచింగ్ టీచర్లకు ఖర్చవుతుంది. ఇన్ కంటాక్స్, కమర్షియల్ టాక్సు ఆఫీసుల్లో



కొందరు నా భృత్యులుంటారు. వారందరకు భూతశాంతిగా సుమారు ఒక లక్ష ఖర్చవుతుంది. ఖర్చులన్నీ పోను ఆ నెలలో నాకు యిరవయి లక్షల రూపాయలు మిగులుతాయి.

ఇందులో మరొక చిట్కా ఉంది. కొందరు తల్లిదండ్రులకు తమ పిల్లలు ఏ యింజినీరో లేక డాక్టరో కావాలని ప్రగాఢ ఆకాంక్ష ఉంటుంది. వారి వద్ద నలభయి నుండి యాభయి వేల వరకు వసూలు చేస్తాను. సీటు వస్తే ఆ డబ్బు వారు వదులుకుంటారు. లేదా వారి డబ్బు తిరిగిచ్చేస్తాను. ఇలాంటి వారు సంవత్సరానికి సుమారు పది మంది తగులుతారు. సాధ్యమయినంత వరకు అందరికీ సీటువచ్చేది. ప్రతి కాలేజీలో నా భృత్యులు అంటే నా దగ్గర కోచింగ్ యిచ్చే వారు ఉంటారు. కొన్ని ప్రైవేటు కాలేజీలలో వారు నా ఏజెంట్స్‌గ పని చేసి కొందరకు సహాయం చేస్తారు. అయితే గత రెండు మూడు సంవత్సరముల నుండి ప్రభుత్వం తీసుకున్న చర్యల మూలంగా యిక్కడ నాకు కొంత ప్రతికూలత ఏర్పడింది. అయినప్పటికి ఏ రూపంలో చూచినా నా ఆదాయం చాల ఎక్కువ.

ఫలితంగ ముప్పయి ఎకరాల స్థలం కొని అందులో మూడంతస్తుల భవనాలు లేపకలిగాను. ఇప్పుడు నేను ఓ కోటీశ్వరుడ్ని.

ఇంకా చెప్పాలంటే చాలా రహస్యాలున్నాయి. ఇక నీ ఉద్యోగం సంగతి! ఈ ఉద్యోగానికి పాతిక వేల దాకా లంచం యిస్తామంటున్నారు కొందరు. కాని నాకు కావలసింది నీలాంటి మేధావులు, గోల్డు మెడలిస్టులు. నీకు యీ ఉద్యోగం యిద్దామని నిర్ణయించుకున్నాను. కాని యిది ఒక వ్యాపార సంస్థ కనుక ఒక నిబంధన ఉంది. నీ సర్టిఫికెట్లు నాకిచ్చివేయాలి! కనీసం ఐదు సంవత్సరాలు యిక్కడ పనిచేస్తానని, అలా చేయలేని పక్షంలో పదివేలు నష్టపరిహారం చెల్లిస్తానని బాండు రాసివ్వాలి. ఈ నిబంధనలకు ఒప్పుకుంటే సోమవారం నుండి క్లాసులు తీసుకోవచ్చు. ఇప్పుడే సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. ఆలోచించి 'చెప్పవచ్చు!" అన్నాడు.

రూంలో నుండి బయటకు వచ్చేసరికి సాయంత్రం ఆరుగంటలయింది. ఇంటి దారి పట్టాను.

ప్రకాశం మాటలు వినిన తరువాత ట్యుటోరియల్ కాలేజిల భాగోతం అవగతమయింది. నా చిన్న తనంలో యిలాంటి తళుకు బెళుకులతో ట్యుటోరియల్ కాలేజిలుండేవి కాదు. ఎక్కడో ఒక ప్రైవేటు మాష్టరు ట్యూషన్లు చెప్పకునేవాడు. మరి యిప్పుడో, ప్రతి టౌనులో ప్రతి వీధి, ప్రతి సందు, ప్రతిగొందిలో యీ ట్యుటోరియల్ కాలేజి బోర్డుల తోరణాలు వ్రేలాడుతున్నాయి. ఆ బోర్డులు పట్టుకొని కొందరు వ్రేలాడుతుంటారు. వీటిల్లో కూడ ఎన్నో స్పర్థలు అంతర్యుద్ధాలుంటాయని వినికిడి. యిదంతా ఒక రేస్‌కోర్సులాగ తయారయింది. విద్యాలయాలు సరిగ పనిచేయకపోవటం దీనికి కారణంగ పలువురు అభిప్రాయపడుతుంటారు.

ఇదంతా ఒక సుడిగాలిలో చిక్కుకోవడమనిపించింది. ఇందులో చేరితే నా ప్రతిభకు రాణింపు ఉండదని భావించాను. 'విద్వాన్ సర్వత్ర పూజ్యతే' నానుడి ప్రకారం నా ప్రతిభకు తగిన వేరే ఉద్యోగం వస్తుందనే నమ్మకం కలిగింది.

సంధ్యా చీకట్లు క్రమ్ముకొస్తున్నాయి. నాన్న దారి చూస్తున్నాడు. కాళ్ళు కడుక్కొని ముంగిలిలో మంచం మీద కూర్చున్నాను.

"ఏమయింది బాబూ!" అన్నట్లుంది నాన్న చూపు ఆ మసక చీకట్లో!

"లాభంలేదు నాన్నా! వాళ్ళ బంధువులబ్బాయికే ఉద్యోగం యిచ్చుకున్నారు!" అన్నాను.

అబద్ధం చెబుతున్నాననే బాధను దిగమ్రింగాను. కాని యిది నా మొదటి అబద్ధం, పైగా నాన్నతో!

పది రోజులు గడిచాయి. ఖాతా యిళ్ళల్లో పాలు అందించి, లైబ్రరీకి వెళ్ళి న్యూస్ పేపరు అందుకున్నాను. మొదటి పేజీలో 'ట్యుటోరియల్ కాలేజి పేరుతో ప్రభుత్వాన్ని, ప్రజల్ని మోసం చేస్తున్న ప్రకాశం అరెస్టు!' అని పెద్ద-పెద్ద అక్షరాలలో వార్త ప్రింటయి ఉంది.

విద్య పేరుతో వ్యాపారం చేశాడని, ఆదాయం లెక్కలు సరిగ చూపి పన్ను చెల్లించలేదని, కాంపెటీటివ్ ఎగ్జామినేషన్ సెంటర్లలో చీఫ్ సూపరిండెంటును యిన్విజిలేటర్లను లాలూచీ పర్చడానికి ప్రయత్నించాడని, అతని యింట్లో లైసెన్సు, బిల్లులేని విదేశీ వస్తువులు, అక్రమంగా బంగారు బిస్కెట్లు, విదేశీ కరెన్సీ, రకరకాల దస్తావేజులు, బ్యాంకు డిపాజిట్ పత్రాలు దొరికాయని దోషారోపణ చేయబడింది.

నేనే మాత్రం ఆశ్చర్యపడలేదు. ఖాళీ పాల క్యానులు సైకిలుకు తగిలించుకొని బయలుదేరాను. బజారు కూడళ్ళలో, హోటళ్ళ ముందు ఎక్కడ చూచినా ప్రజలు యీ విషయమే రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

ఇల్లు చేరి ముఖం కడుక్కొని లోనకు వెళ్ళి మంచం మీద కూర్చున్నాను.

"అన్నం వడ్డించ నా!" అంది అమ్మ.

"కొంచెము ఆగి భోం చేస్తానమ్మా! ఎండలో వచ్చాను గదా! కాసిని మంచినీళ్ళివ్వు!" అన్నాను.

"మర్చిపోయాను నాయనా! పొద్దున నీకేదో ఉత్తరం వచ్చింది!" అంటూ తెచ్చి యిచ్చింది అమ్మ మంచినీళ్ళతోపాటు.

నీళ్ళు త్రాగి కవరు విప్పాను. ఐ.ఏ.ఎస్. సెలెక్షన్ లెటర్ వచ్చింది.

"భగవంతుడా! నాకు ఎంత మంచి ఆలోచన కలిగించావు! ఆ ప్రకాశం సుడిగాలిలో యిరుక్కొని సర్టిఫికేట్లు కూడా యిచ్చేసి ఉంటే, ఎక్కడ చతికిల పడేవాడినో కదా!" అని భావిస్తూ, నా ప్రతిభ నిజంగా రాణించినందులకు ఆపరంధాముని హృదయ పుష్పంతో ఆరాధిస్తూ కళ్ళు మూసుకున్నాను.

"ఏమిటి నాయనా ఉత్తరం!" అంది అమ్మ నా నిశ్చలావస్థని గమనించి

"నాకు ఉద్యోగం వచ్చిందమ్మా! మంచి ఉద్యోగం!" అంటూ అమ్మకేసి చూశాను.

ప్రశాంతంగా ఉంది అమ్మ ముఖం ◯

ఆరు సెంచరీలు నాటౌట్

తెలుగు హాస్యనటుడు డా. అల్లు రామలింగయ్య 600 చిత్రాలు పూర్తి చేశారు. 30 సంవత్సరాల క్రితం అల్లు చిత్రరంగంలోకి అడుగుపెట్టాడు. పద్మశ్రీ అల్లు రికార్డు యిలా వుండగా మరో దక్షిణాది హాస్యనటి మనోరమ చిత్రరంగంలోకి ప్రవేశించి 27 సంవత్సరాలే అయినా వెయ్యి చిత్రాలకు పైగా నటించిందట. ప్రపంచ రికార్డులు చోటు చేసుకొనే గిన్నిస్ పుస్తకంలోకి ఎక్కేందుకు మనోరమ ప్రయత్నిస్తోందట. మగ పేర్లలో శ్రీ అల్లు రామలింగయ్య పేరు ఎక్కుతుందేమో మరి.